
సాక్షి
కుమురం భీం

సోమవారం । 27 । నవంబర్ । 2023



కమనీయం.. కార్తీకం
కార్తీక మాసం ప్రారంభం నుంచి ఆలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. సోమవారం కార్తీకపౌర్ణమి నేపథ్యంలో ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. 6లో▸



భరోసా ఇవ్వని 'మద్దతు'
పంటలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు రైతన్నకు భరోసా ఇవ్వడం లేదు. వాతావరణం అనుకూలించక దిగుబడులు భారీగా తగ్గుతున్నాయి. 7లో▸

గరిష్టం/కనిష్టం
29.4 /18.4

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రత సాధారణం కన్నా తక్కువగా నమోదవుతుంది. అక్కడక్కడా చినుకులు పడే అవకాశం ఉంది.

బాసర స్మరణ.. రాంజీ ప్రేరణ



వేదికపై ప్రధాని మోదీతో నిర్మల్, ముథోల్, ఖానాపూర్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థులు

అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ



- కొయ్యబొమ్మకు 'మోదీ గ్యారంటీ'
- పసుపు కోసం ప్రపంచం చూస్తోంది
- బీజేపీ గెలుపు స్పష్టంగా కనిపిస్తోంది
- నిర్మల్ సభలో ప్రధాని నరేంద్రమోదీ
- గెలిస్తే నిర్మల్ 'స్మార్ట్‌సిటీ' చేస్తాం..
- మాస్టర్‌ప్లాన్ రద్దు చేస్తాం : ఏలేటి

నిర్మల్: 'నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ శుభాభినందనాలు. బాసర సరస్వతీమాత చరణాలకు నా ప్రణామం. ఈ గడ్డపై పుట్టిన ఆదివాసీ యోధులు కుమురంభీం, రాంజీగోండుకు నా నివాళులు. తన పోరాటంతో రాంజీగోండు యువతకు ప్రేరణగా నిలిచారు..' అంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ రోడ్డులో పాతక్రషర్ ఎదురుగా ఆదివారం నిర్వహించిన సకల జనుల విజయసంకల్ప సభలో ప్రధాని పాల్గొన్నారు. నిర్మల్, ముథోల్, ఖానాపూర్, ఆదిలాబాద్, బోథ్ అభ్యర్థులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, రమేశ్‌రాథోడ్, పాయల్ శంకర్, సోయం బాపూరావు తరఫున నిర్వహించిన ఈ ఎన్నికల సభకు భారీగా జనం తరలివచ్చారు. సభాప్రాంగణం నుంచి కనుచూపు మేరంతా జనసంద్రమే కనిపిస్తోందని, కాంగ్రెస్ సుల్తానులు, బీఆర్‌ఎస్ నిజాంలు ఒక్కసారి వచ్చి చూస్తే.. రాంజీగోండు ప్రేరణ, బీజేపీ గెలుపు ఖాయమన్న విషయం తెలుస్తుందని మోదీ అన్నారు. తమకు తాము రాజకీయ తీస్మార్‌ఖాన్ అనుకుంటున్నారో, రాజనీతి జ్ఞానిగా భావిస్తున్నారో ఒక్కసారి ఇక్కడికి వచ్చి చూడాలని సూచించారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కేసీఆర్ ఎప్పుడో కారు స్టీరింగ్ వేరేవాళ్లకు అప్పగించి ఫామ్‌హౌస్‌కు వెళ్లి పడుకుంటున్నాడన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి అవసరమా అని ప్రశ్నించారు. సకల జనుల సౌభాగ్య తెలంగాణ కోసం ప్రజలంతా బీజేపీ వైపు నిలిచారని మోదీ చెప్పారు.

కొయ్యబొమ్మకు గ్యారంటీ..
బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు మేడిన్ ఇండియా అన్నా.. మేకిన్ ఇండియా అన్నా.. ఇష్టం ఉండదని ప్రధాని ఆరోపించారు. ఈ కారణంగానే ఘనమైన చరిత్ర కలిగిన నిర్మల్ కొయ్యబొమ్మల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్మల్ కొయ్యబొమ్మలకు పూర్వవైభవం తీసుకువస్తామని, ఇది మోదీ గ్యారంటీ అని స్పష్టం చేశారు. నిజామాబాద్‌లో ఏర్పాటు చేయనున్న జాతీయ పసుపుబోర్డుతో నిర్మల్ జిల్లా రైతులకూ మేలు కలుగుతుందన్నారు. ఇక్కడి పసుపురైతులు పండించే పసుపు కోసం ప్రపంచం ఎదురుచూస్తోందని తెలిపారు. కోవిడ్ తర్వాత పసుపు విలువ ప్రపంచానికి తెలిసి వచ్చిందన్నారు. వరి రైతులకు మద్దతుగా ధాన్యం క్వింటాల్‌కు రూ.3,100 చెల్లిస్తామని ప్రకటించామని అన్నారు.

తెలుగులో మాట్లాడుతూ..
ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించడంతోపాటు మధ్యమధ్యలో తెలుగులో మాట్లాడుతూ అందరినీ ఆకట్టుకున్నారు. అసలు ప్రధానమంత్రి ఇంతా బాగా తెలుగు మాట్లాడగలరా.. అనేలా భాషను ఉచ్చరించారు. 'మొదటిసారి తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కానుంది..' అని అనడంతో సభలో విశేష స్పందన వచ్చింది. 'ప్రజలను కలవని, సచివాలయానికి వెళ్లని సీఎం అవసరమా..' అంటూ తెలుగులోనే ప్రశ్నించారు. 'మోదీ గ్యారంటీ అంటే గ్యారంటీగా పూర్తి అయ్యేది..' అని చెప్పడం, ప్రతీసారి 'నా కుటుంబసభ్యులారా..' అని సంబోధించడం సభికులను ఆకట్టుకుంది. సభ ఆద్యంతం 'మోదీ.. మోదీ..' అన్న నినాదాలతో సభాప్రాంగణం మార్మోగింది.

మోదీకి నీరా'జనం'..
నిర్మల్/నిర్మల్‌టౌన్: తొలిసారి జిల్లాకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి నీరా'జనం' లభించింది. అసెంబ్లీ ఎన్నికలకు నాలుగురోజుల ముందు చేపట్టిన సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో బీజేపీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. ఊహించని రీతిలో నలువైపుల నుంచి తరలిరావడంతో నిర్మల్ కాషాయమయమైంది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచే సభాప్రాంగణం నిండిపోయింది. ప్రధాని వచ్చేసమయానికి సమీకృత కలెక్టరేట్ రోడ్డంతా కిక్కిరిసిపోయింది. సభాప్రాంగణం చాలాక పోవడంతో చాలా మంది బయట, రోడ్లపై నిల్చున్నారు.

ఎమ్మార్పీఎస్, జనసేన మద్దతు..
మాదిగ రిజర్వేషన్లకు ప్రధాని మోదీ అండగా నిలువడంతో నిర్మల్‌సభకు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు మద్దతుగా తరలివచ్చారు. ఎమ్మార్పీఎస్ జెండాలు పట్టుకుని వారంత సభలో పాల్గొన్నారు. జనసేన కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు పార్టీ జెండాలతో సభకు వచ్చారు.

ఎంపీ సోయం గైర్హాజరు..
నిర్మల్‌లో నిర్వహించిన మోదీ సభకు ఆదిలాబాద్ ఎంపీ, బీజేపీ బోథ్ అభ్యర్థి సోయం బాపురావు గైర్హాజరయ్యారు. పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, ముఖ్యనేతలందరూ పాల్గొన్నారు. నిర్మల్, ముథోల్, ఖానాపూర్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, రమేశ్ రాథోడ్, పాయల్ శంకర్, అజ్మీరా ఆత్మారాం నాయక్ హాజరయ్యారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, ఉమ్మడి ఆదిలాబాద్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, మాజీ ఎమ్మెల్యే సుమన్‌రాథోడ్, తదితరులంతా హాజరయ్యారు. బోథ్ అభ్యర్థిగా పోటీలో ఉన్న సోయం బాపురావు ప్రధాని సభకు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

పాదాభివందనం చేయబోతే..
నిర్మల్ సభలో పాల్గొన్న మోదీ తన ప్రసంగం ముగించుకుని వచ్చిన తర్వాత వేదికపై ఉన్న వారందరూ దగ్గరకు వచ్చి కలిశారు. ఈక్రమంలో అక్కడే ఉన్న ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే సుమన్ రాథోడ్ మోదీకి పాదాభివందనం చేయబోయారు. అలా చేయవద్దంటూ.. మోదీ కూడా ముందుకు వంగి ఆమెకు అభివాదం చేయడం ఆకట్టుకుంది.



సభకు హాజరైన జనం

ఖానాపూర్‌లో గెలిచే పార్టీకే పగ్గాలు



అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

సభకు హాజరైన ప్రజలు

- ప్రస్తుత ఎమ్మెల్యే సక్రమంగా లేకనే జాన్సన్‌కు టికెట్ ఇచ్చిన
- రాయేదో.. రత్నమేదో తెలుసుకుని ఓటేయాలి
- మళ్లీ గెలిచాక సదర్మాట్ ఆయకట్టు మరో 20వేల ఎకరాలకు పెంచుతాం
- ఎన్నికలయ్యాక ఖానాపూర్ వచ్చి సమస్యలన్నీ పరిష్కరిస్తా
- జాన్సన్ నా కుమారుడి క్లాస్‌మెంట్, ఆయనకు ఓటేస్తే నాకు వేసినట్టే
- ఖానాపూర్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

ఖానాపూర్/కడెం: ఖానాపూర్ నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే.. రాష్ట్రంలో అదే పార్టీ అధికారంలోకి వస్తుందని, ఇక్కడ ఎవరు గెలవాలో.. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం రావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని జేకే నగర్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఖానాపూర్ వచ్చిన సీఎంకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఖానాపూర్ అభ్యర్థి భుక్యా జాన్సన్‌నాయక్ తదితరులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం సభలో కేసీఆర్ మాట్లాడారు. ప్రసంగం ఆయన మాటల్లో.. 'జాన్సన్‌నాయక్ గురించి మీకు ఎంతవరకు తెలుసో నాకు తెలియదు.. జాన్సన్ నా కుమారుడు రాము క్లాస్‌మేట్. మొన్న రాము జన్నారం వచ్చినప్పుడు ఖానాపూర్‌ను దత్తత తీసుకుంటానన్నాడని నాకు తెలిసింది. రాము దత్తత తీసుకున్నాక మీకు ఏం తక్కువ కాదు. కేటీఆర్ తీసుకుంటే నేను తీసుకున్నట్టే. జాన్సన్‌కు ఓటు వేస్తే నాకు వేసినట్టే. ఆయన డబ్బుల కోసం రాజకీయాల్లోకి రాలేదు. దేవుడు ఆయనకు చాలా డబ్బులు ఇచ్చాడు. అతనికి అమెరికాలోనే సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్నాయి. యువకులు, చదువుకున్నోళ్లు రాజకీయాల్లోకి రావాలని జాన్సన్‌ను నేనే రమ్మన్న.

ఇక్కడ ఎమ్మెల్యే సక్కగ లేకనే..
ఖానాపూర్ ఎమ్మెల్యే సక్కగ లేరు. ఇక్కడంతా పిచ్చిపిచ్చి వ్యవహారం ఉంది. ఎమ్మెల్యే లంచాలు తీసుకుంటుందని చాలా ఫిర్యాదులు వచ్చాయి. అందుకే చదువుకున్న బుద్ధిమంతులు ఖానాపూర్ ఎమ్మెల్యేగా ఉండాలని జాన్సన్‌కు టికెట్ ఇచ్చిన. అతను టికెట్ అడుగలేదు. నిస్వార్థంగా సేవచేస్తాడు. మీకు ఏం కావాలన్నా నిమిషాల్లో వస్తాయి. రాయేదో రత్నమేదో తెలుసుకుని ప్రజలు ఓటెయ్యాలి.

రోజంతా ఇక్కడే ఉంటా..
డిసెంబర్ 3 తర్వాత ఎన్నికలు పూర్తయితయ్.. మళ్లీ మన ప్రభుత్వమే ఏర్పడుతది. కొత్త ప్రభుత్వం కొలువుదీరినంక నేనే ఇక్కడికి వస్తా.. రాష్ట్రస్థాయి అధికారులను తోలుకొని వస్తా. దినమంతా ఖానాపూర్‌లో మీతోనే ఉండి ఏమేం పనులు కావాలో నోట్‌చేసుకుని అవ్వన్నీ చేపిస్తా. జాన్సన్‌కు దేశవిదేశాలు తిరిగిన అనుభవం ఉంది. మా కుటుంబానికి దగ్గరున్న వ్యక్తి గెలిస్తే మీకు లాభం జరుగుతది.

'సదర్మాట్' బాధ్యత నాదే..
సదర్మాట్ నిర్మాణం పూర్తిచేసి ఆయకట్టు రైతులకు నీరందించే పూర్తి బాధ్యత నాదే అని సీఎం కేసీఆర్ అన్నారు. 'ఇప్పటికే 15 వేల ఎకరాలకు నీరిస్తున్నం. ఆయకట్టు మరో 20వేల ఎకరాలు పెంచుతం. జాన్సన్ చెప్పిన విధంగా డిగ్రీ కళాశాల మంజూరు చేస్తాం. ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తా. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో ఆంక్షలు ఎత్తేసేలా చూస్తా. ఈ ప్రాంతం నుంచి ఉపాధి కోసం వెళ్లి ఇక్కట్లు పడుతున్న గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. కాంగ్రెస్ పార్టీకి పొరపాటున ఓటేస్తే రైతులు అన్యాయమైతరు. రాష్ట్రం ఎవరి చేతుల్లో ఉంటే సుభిక్షంగా ఉంటదో ఆలోచించి ఓటు వేయాలి..' అని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దండె విఠల్, మధుసూదనచారి, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలచారి, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు రవీందర్‌రావు, నాయకులు పూర్ణచందర్ నాయక్, జానుబాయి, చారులత, రాజేందర్, భరత్‌చౌహాన్, నారాయణరావు, కొప్పుల నరేశ్, రామునాయక్, రాంకిషన్‌రెడ్డి, రాంచందర్, మోహిద్, వెంకాగౌడ్, రాజగంగన్న, సురేశ్, ఖలీల్, అనిష్‌ఖాన్, శ్రావణ్, శ్రీనివాస్, కిశోర్, గంగాధర్, సతీశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చివరిశ్వాస వరకు ప్రజా సేవచేస్తా..
– జాన్సన్ నాయక్



తనను గెలిపిస్తే ఖానాపూర్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిన సీఎం కేసీఆర్ గర్వపడేలా చివరిశ్వాస వరకు ప్రజా సేవచేస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. వెనుకబడిన ఖానాపూర్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్ చేయడంతోపాటు సదర్మాట్ బ్యారేజీ నుంచి ఖానాపూర్ వరకు ప్రత్యేక కాలువ ఏర్పాటు చేయాలని సీఎంను కోరారు. కడెం ప్రాజెక్టును ఆధునికీకరించడంతోపాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలన్నారు. కవ్వాల్ టైగర్‌రిజర్వ్ ఫారెస్ట్‌లో ఆంక్షలు సడలించి టూరిజం హబ్ చేయాలని కోరారు. మారుమూల గిరిజన గ్రామాలైన పెంబి మండలం యాపల్‌గూడ, గుమ్మెన, సిరిచెల్మ, కడెం మండలం గంగాపూర్, అల్లంపల్లి ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు.

న్యూస్‌రీల్

రేపు ఉమెన్స్ కబడ్డీ ఎంపిక పోటీలు
ఆసిఫాబాద్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలికల మోడల్ స్కూల్ స్టేడియంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఉమెన్స్ జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఇన్‌చార్జి కార్యదర్శి ఆత్రం ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల క్రీడాకారులు ఆధార్ కార్డు, పాస్ ఫొటోతో పీడీ తిరుపతిని సంప్రదించాలని సూచించారు. రూ.100 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 4 నుంచి 7 వరకు నిజామాబాద్ జిల్లాలో నిర్వహించే 70వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. పూర్తి వివరాలకు 94417 34946, 99493 00668 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఓటు వినియోగించుకున్న ఉద్యోగులు



ఓటు వినియోగించుకుంటున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు చెందిన 3,761 మంది పోస్టల్ ఓటు కోసం దరఖాస్తు చేసుకోగా, ఇప్పటివరకు 345 మంది ఓటు వేశారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా పోలీసులు ఎన్నికల విధులు సమర్థవంతంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఆదివారం పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ప్రతిఒక్కరితో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. ఈ నెల 29 మధ్యాహ్నం నుంచి 30వ తేదీ పోలింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రిని సురక్షితంగా తరలించడం ముఖ్యమన్నారు. ఎన్నికలకు 48 గంటల ముందు నుంచే పోలింగ్ కేంద్రాల్లోకి అనధికార వ్యక్తులను అనుమతించొద్దన్నారు. స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఉంటుందని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రిసైడింగ్ అధికారులకు సహాయకారిగా ఉండాలన్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేయడం, పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరం వరకు జనాలు గుమిగూడకుండా చూడటం, 200 మీ.ల దూరం వరకే వాహనాలను అనుమతించడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లకు నగదు, మద్యం, ఇతర వస్తువులు సరఫరా చేసే వారిపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, ఎస్పీ సీఐ రాణాప్రతాప్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

గిరిజన గురుకులంలో ఎన్‌సీసీ దినోత్సవం



మొక్క నాటుతున్న విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బూర్గుడ సమీపంలో గల గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం 76వ ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ప్రిన్సిపాల్ దివ్యారాణి మాట్లాడుతూ కళాశాల నుంచి పలువురు విద్యార్థినులు ఎన్‌సీసీకి ఎంపికై శిక్షణ పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శారద, ఎన్‌సీసీ కేర్ టేకర్ ప్రియాంక, వందన తదితరులు పాల్గొన్నారు.

'హస్తం' పట్టు నిలిచేనా..?

- ప్రచారంలో వెనుకబడ్డ కాంగ్రెస్
- పార్టీలో లుకలుకలతో కలిసి రాని ముఖ్య నాయకులు
- పట్టున్న ప్రాంతాల్లోనూ ఓటర్ల మద్దతు కూడగట్టడంలో విఫలం
- ఎన్నికల నాటికి పరిస్థితి మారుతుందనే ధీమాలో అభ్యర్థులు

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో గడ్డు పరిస్థితుల్లోనూ కనీసం ఒక్క అసెంబ్లీ స్థానంలోనైనా కాంగ్రెస్ అభ్యర్థులు పట్టు నిలుపుకుంటూ వస్తున్నారు. జిల్లా ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే ఇదే కనిపిస్తోంది. టీఆర్‌ఎస్(ప్రస్తుతం బీఆర్‌ఎస్) ప్రభంజనంలో సైతం ఆసిఫాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి ఆ పార్టీ అభ్యర్థి విజయం సాధించారు. అయితే ప్రస్తుత ఎన్నికలు ఆ పార్టీకి సవాల్‌గా మారాయి. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ప్రధానంగా ఆసిఫాబాద్ కాంగ్రెస్‌కు అచ్చొచ్చిన నియోజకవర్గంగా ఉంది. ఎన్నికల సమయంలో వ్యూహాలు రూపొందించడంలో దిట్టగా పేరున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు సైతం ఎన్నికల్లో కచ్చితంగా గెలుపొందుతామని ధీమాతో ఉన్నారు. అయితే ఇది గత నెల వరకు అంచనా. ఆ పార్టీలోని కొందరు ముఖ్య నేతలు బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్న తర్వాత పరిస్థితి క్రమంగా దిగజారుతున్నట్లు తెలుస్తోంది.

ఆసిఫాబాద్‌లో హవా..
సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలు 1952లో ఆవిర్భవించాయి. సిర్పూర్ నియోజకవర్గానికి ఇప్పటివరకు 16 సార్లు, ఆసిఫాబాద్ నియోజకవర్గానికి 15 సార్లు ఎన్నికలు జరగ్గా.. సిర్పూర్‌లో ఐదు సార్లు, ఆసిఫాబాద్‌లో 10 సార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. ఎన్నికల ఫలితాలను బట్టి సిర్పూర్‌లో ఆ పార్టీ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మాత్రం తొలి నుంచీ కాంగ్రెస్ హవా కొనసాగింది. గత ఎన్నికల్లో టీఆర్‌ఎస్(ప్రస్తుత బీఆర్‌ఎస్) పార్టీ హవాలోనూ ఆ పార్టీ అభ్యర్థి కోవ లక్ష్మిపై కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సక్కు 171 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇది ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఉన్న పట్టుకు నిదర్శనం.

ఎవరికి వారే..
ప్రస్తుతం అధికార పార్టీపై ప్రజల్లో వ్యతిరేక పవనాలు వీస్తుండటంతో ఆసిఫాబాద్‌లోని కాంగ్రెస్ కార్యకర్తలు, నేతల్లో మరింత జోష్ పెరుగుతుందని పార్టీ వర్గాలు భావించాయి. ఇది పార్టీ విజయానికి కలిసి వస్తుందని అంచనా వేశారు. కానీ పార్టీ అభ్యర్థి, ముఖ్య నేతల మధ్య లుకలుకలు ఏర్పడటంతో 'ఎవరికి వారే.. యమునా తీరే' అన్న తీరుగా వ్యవహరిస్తున్నారని ప్రచారం సాగుతోంది. చివరకు తమకు బాగా పట్టున్న మండలాల్లో సైతం ఓటర్ల మద్దతు కూడగట్టలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. పరిస్థితి దిగజారుతుండటంతో ముఖ్యనేతలకు సైతం ఏం చేయాలో అంతుచిక్కడం లేదు. ప్రస్తుతం సిర్పూర్‌లో బీఆర్‌ఎస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థులు ప్రచారంలో ముందున్నారు. ఆ పార్టీ అభ్యర్థుల మధ్యే త్రిముఖ పోరు నడుస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఇక్కడ కనీసం పోటీ ఇచ్చే పరిస్థితిలో లేదన్న భావన ప్రజల్లో నెలకొంది. జిల్లాలో ఎక్కువ సార్లు గెలుపొందిన చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇక్కడ ఏ స్థానంలో నిలుస్తోందో తెలియని పరిస్థితి. ఆసిఫాబాద్‌లో ఎన్నికల నాటికి కొంత మెరుగుపడే అవకాశాలు లేకపోలేదని కాంగ్రెస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా పార్టీని నమ్ముకుని పనిచేసిన మర్సుకోల సర్వసతి పార్టీని వీడి తన సోదరి బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మికి మద్దతు ప్రకటించింది. ఇక డాక్టర్ గణేశ్ రాథోడ్ కూడా అసంతృప్తిగానే ఉన్నారు. ఆయన వర్గం సైతం ఎన్నికల్లో అంటిముట్టనట్టుగానే వ్యవహరిస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థికి పోటీగా ఆయన సోదరుడు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలవడం.. అదే విధంగా ఆ పార్టీకి బాగా పట్టున్న తిర్యాణి, రెబ్బెన, ఆసిఫాబాద్, జైనూర్, సిర్పూర్(యూ) మండలాల్లో ప్రజల నుంచి వ్యతిరేకత కనిపిస్తోంది. ఆయా మండలాల్లో ఆదివాసీ ఓటర్లు అధికంగా ఉండటం కోవ లక్ష్మికి కలిసివచ్చే అవకాశం ఉంది.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద జైభీం సేన ఆధ్వర్యంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు జాడి వినోద్ మాట్లాడుతూ ఎందరో మేధావులు కష్టపడి రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. కుల, మత, వర్ణ తేడాలు లేకుండా ప్రజలు రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలని కోరారు. పౌరులందరూ బాధ్యతాయుతంగా క్రమశిక్షణతో విధులు నిర్వహించినప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అశోక్, సుధాకర్, ప్రమోద్, అనిల్‌కుమార్, కృష్ణాజీ, సాంబయ్య, పెంటయ్య, భరత్, శంకర్, వెంకటేశ్, నవీన్, ఆకాశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో వేడుకలు నిర్వహిస్తున్న జైభీం సేన ప్రతినిధులు

క్లుప్తంగా

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

మందమర్రిరూరల్: పట్టణంలోని ఏడు కానాల మోరి సమీపంలో ఆదివారం గుర్తు తెలియని రైలు ఢీకొని వంగల సుశీల (78) మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వర్‌రావు తెలిపారు. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన సుశీలకు కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయింది. మృతురాలి కుమారుడు సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు రాజేశ్వర్‌రావు తెలిపారు. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి



సునీల్ (ఫైల్)

జైపూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం భీమారంకు చెందిన సోలంకి సునీల్ (28) చెన్నూర్‌లో తన కులవృత్తి అయిన సికమ్మరి పని చేసుకుంటూ భార్యాపిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. శనివారం పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై చెన్నూర్ నుంచి జైపూర్ వైపు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కీర్తన, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మందమర్రిరూరల్: పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఆదివారం ఓ వ్యాపారి చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని మున్సిపల్ సిబ్బంది కూల్చివేయించారు. బ్యాంకు ఎదుట సదరు వ్యాపారి అక్రమ నిర్మాణం చేపట్టిన విషయం కమిషనర్ రాజు దృష్టికి వెళ్లడంతో వెంటనే సిబ్బందిని పంపించి బ్లేడ్ ట్రాక్టర్‌తో చదును చేయించారు. గతంలో కూడా ఈ వ్యాపారి అక్రమ నిర్మాణం చేపట్టగా అధికారులు నిలిపివేశారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రాజును వివరణ కోరగా మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతి లేదని, ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

రామకృష్ణాపూర్: పట్టణంలోని అబ్రహాంనగర్‌కు చెందిన బాలకృష్ణపై శనివారం రాత్రి దాడి చేసిన రాకేశ్, వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. బాలకృష్ణ కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని జీర్ణించుకోలేక బీఆర్‌ఎస్ నాయకుల అండదండలతో దాడికి పాల్పడ్డారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

బెజ్జూర్: మండలంలోని సలుగుపల్లి పెట్రోల్ బంక్ ప్రాంతంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. మండలంలోని బాపూగూడకు చెందిన నవీన్ బెజ్జూర్ నుంచి తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా సలుగుపల్లి పెట్రోల్‌బంక్ చర్చికి వెళ్లే దారి వద్ద ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో ఇరువురికి గాయాలయ్యాయి.

అనుచరుల ప్రచారం.. అభ్యర్థులకు సంకటం!

- ప్రజలను ఇబ్బంది పెట్టేలా క్యాంపెయిన్
- వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీ ఫిరాయింపులు
- అరాచకాలను గుర్తు చేసుకుంటున్న ప్రజలు



జంగ్ తెలంగాణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు వింత సమస్య ఎదుర్కొంటున్నారు. ప్రచారంలో ఓటర్ల నుంచి సరైన సానుకూలతను పొందలేక పోతున్నట్లు తెలుస్తోంది. ఓ ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థి తీవ్ర వ్యతిరేకతను చవి చూస్తుండగా ప్రత్యర్థి అభ్యర్థి సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇన్నాళ్లుగా ఓ ప్రధాన రాజకీయ పార్టీలో పనిచేసిన కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు, కొంతమంది అనుచరులు సాగించిన ఆగడాలకు అడ్డు లేకుండా పోయిందంటే అతిశయోక్తి కాదు. వీరి ఆగడాలను ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లు నెమరు వేసుకుంటున్నారు. ఆ పార్టీలో ఉండి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అనుచరగణం ఎన్నికల వేళ కొంతమంది ప్రత్యర్థి పార్టీలో చేరుతుండగా ఇంకా అనేక మంది కండువా మార్చుకోవడానికి ఇష్టపడక అదే పార్టీలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆ అనుచరగణం, చోటా మోటా లీడర్లు రెండు ప్రధాన పార్టీల్లో ఉండి అభ్యర్థి పంచన చేరి సాగిస్తున్న ఎన్నికల ప్రచారాన్ని చూసి ఓటర్లు ముక్కున వేలేసుకుంటున్నారు. వీరు సాగించిన చర్యల వల్ల ప్రచారం చేస్తున్న అభ్యర్థికి ఓటర్ల నుంచి ఎంతవరకు సానుకూలత వ్యక్తం అవుతుందో తెలియకుండా ఉంది.

ఇబ్బందులు కలిగించి... వివాదాల్లో తలదూర్చి..

కొత్తగా పార్టీలో చేరుతున్న ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, యువకులతో ఆయా పార్టీల్లో జోష్ కనిపిస్తుండగా అంతర్గతంగా అభ్యర్థులు ధైర్యం కూడగట్టుకోలేక పోతున్నట్లుగా తెలుస్తోంది. ఓ పార్టీలో పనిచేసిన కొందరు అనేక సమస్యల్లో తలదూర్చి ప్రజలను పీడించి పిప్పి చేశారనే విమర్శలు ఉన్నాయి. బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఎవరు ఇళ్ల నిర్మాణం చేపట్టినా మున్సిపల్ అధికారులతో కట్టడి చర్యలకు పాల్పడ్డారనే విమర్శలున్నాయి. డబ్బుల కోసం కొందరు మున్సిపల్ కౌన్సిలర్లు గృహ నిర్మాణదారులను పెట్టిన ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఫిల్లర్‌కో లెక్క కట్టి డబ్బులు వసూలు చేశారనే విమర్శలు ఉన్నాయి. అడిగినంత ఇవ్వందే ఇంటి నిర్మాణం జరగనీయకుండా అడ్డంకులు కల్పించారనేది బహిరంగ రహస్యం. అదేతీరుగా వ్యక్తిగత తగాదాల్లో, రోడ్డు ప్రమాద ఘటనల్లో, చివరికి భార్యాభర్తల వివాదాల్లోనూ అనివార్యంగా తలదూర్చి అక్రమంగా కేసులు పెట్టించి అందిన కాడికి దండుకున్నారనే విమర్శలున్నాయి. అంతగా ఇబ్బందులకు గురిచేసిన ఘటనలను పుర ప్రజలు ప్రస్తుతం గుర్తు చేసుకుంటున్నారు. కొందరు మున్సిపల్ కౌన్సిలర్లు, యువజన శ్రేణులతోపాటు రౌడీ షీటర్లు, భూకబ్జా దారులు వ్యవహరించిన తీరును ఓటర్లు రకరకాలుగా చర్చించుకుంటున్నారు. అలాంటి చర్యలకు పాల్పడిన శ్రేణులు ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ముందుండి ప్రచారం చేస్తుండడంతో సదరు పార్టీ అభ్యర్థికి ఎంత వరకుఓట్లు రాలుతాయి? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

గ్రామాల్లో సైతం...

సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు కొందరు అడ్డూ అదుపు లేకుండా వ్యవహరించినట్లు విమర్శలు ఉన్నాయి. ప్రజల మౌళిక సమస్యలను తీర్చడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిన సదరు ప్రజా ప్రతినిధులు అధికారం అడ్డుపెట్టుకుని ప్రత్యర్థులు, గిట్టని వ్యక్తులపై దౌర్జన్యాలు సాగించిన సందర్భాలు నియోజకవర్గంలో చోటు చేసుకున్నాయి. రాజకీయ ఆధిపత్యం కోసం ప్రత్యర్థులపై భౌతిక దాడులు చేసి అక్రమంగా కేసులు పెట్టించారనే విమర్శలు వచ్చాయి. తామేం తక్కువ కాదన్నరీతిలో గ్రామ, మండల స్థాయి నాయకులు సాగించిన ప్రజా వ్యతిరేక చర్యలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. వీరి దురాగతాలు, కక్ష పూరిత చర్యలను గ్రామీణులు ఇంకా మర్చిపోలేక పోతున్నారు. ప్రస్తుతం పతాక స్థాయికి చేరుకున్న ఎన్నికల ప్రచారంలో ఆగడాలు సాగించిన, అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేసిన, భూ కబ్జాలకు పాల్పడిన అక్రమార్కులు, రౌడీషీటర్లుగా ముద్రపడిన వ్యక్తులు ఓటర్లను ఎంతవరకు ప్రభావితం చేస్తారనేది ఆసక్తిని కలిగిస్తోంది.

పోస్టల్ బ్యాలెట్...



పోస్టల్ బ్యాలెట్ నమూనా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుర్తులు లేకుండానే అభ్యర్థులకు వేసే ఓటే పోస్టల్ బ్యాలెట్. ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కు వినియోగించుకుంటారు. అయితే పోస్టల్ బ్యాలెట్‌లో పార్టీ గుర్తులు ఉండవు. పోటీలో నిలిచిన అభ్యర్థుల పేర్లు, పార్టీల పేర్లు మాత్రమే ఉంటాయి. గతంలో బ్యాలెట్ పత్రాల పద్ధతిలో ఓటింగ్ జరిగినప్పుడు మామూలుగా ఓటర్లకు ఇచ్చే బ్యాలెట్ పత్రాన్ని ఉద్యోగులకు ఇచ్చేవారు. ఉద్యోగులు తమకు నచ్చిన పార్టీ గుర్తుపై ఓటు వేసేవారు. కానీ ప్రస్తుతం పోస్టల్ బ్యాలెట్‌లో పార్టీల గుర్తులు ఉండవు. శిక్షణ సమయంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు ఫారం–12 ద్వారా తమ పూర్తి వివరాలతో పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకుంటారు. ఓట్ల లెక్కింపులో మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను అధికారులు లెక్కిస్తారు. అనంతరం ఈవీఎంలలో నమోదైన ఓట్లను లెక్కిస్తారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఈసారి అసెంబ్లీ ఎన్నికల విధుల నిర్వహణలో ఉన్న ఆరు వేల మంది వరకు ఈ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

పోల్‌చీటీ రాకపోయినా ఓటు వేసుకోండిలా..



నెన్నెలలో పోల్‌చీటీలు పంపిణీ చేస్తున్న బీఎల్‌వో

నెన్నెల: ఓటర్లకు పోల్ చీటీలు అందకపోయినా ఓటర్లు ఓటు వేసుకునే అవకాశం ఉంది. చిట్టీ రానంత మాత్రాన ఓటుహక్కు వినియోగంలో ఇబ్బంది లేదు. పోలింగ్ రోజు బీఎల్‌వోలు ఆయా బూత్‌ల వద్ద అందుబాటులో ఉంటారు. వారిని కలిసి పోల్ చిట్టీలు రాయించుకోవచ్చు. ఓటరు జాబితాలో క్రమసంఖ్య తెలుసుకుని బూత్‌లోని సిబ్బందికి చెప్పి వారికి తానే సంబంధిత ఓటరునని నిరూపించే గుర్తింపు కార్డును చూపి ఓటు వేసుకునే అవకాశం ఉంది. లేదా సెల్‌లో ఓటరు హెల్ప్‌లైన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని తాను ఏ పోలింగ్ కేంద్రంలో ఉన్నది తెలుసుకుని ఓటు వేసుకునే అవకాశం ఉంది. బయట ఓటరు జాబితా పరిశీలించి పేరు, క్రమ సంఖ్యను కాగితంపై రాసుకునివెళ్లవచ్చు. దానికి అనుబంధంగా ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి పోలింగ్ కేంద్రంలో అధికారులకు చూపించాలి.

పాలబిల్లులు సకాలంలోచెల్లించాలి

రామకృష్ణాపూర్: పాడి రైతులకు రావాల్సిన పాల బిల్లులు సకాలంలో చెల్లించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పాడి రైతుల సంఘం రాష్ట్ర కో కన్వీనర్ వీరమల్ల రాజయ్య కోరారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయ డెయిరీ ద్వారా నిత్యం పాలుపోస్తున్న రైతులకు ప్రతీ నెల సకాలంలో బిల్లులు రావడం లేదన్నారు. దీంతో పశువుల దానాకు, కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై మేనేజర్లు, డీడీకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రతీ 15 రోజులకోసారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడేలా చూడాలని కోరారు.

ప్రాణహిత తీరం వెంట డ్రోన్ నిఘా



అర్జునగుట్టలో డ్రోన్‌తో నిఘాను పరిశీలిస్తున్న సీపీ



డ్రోన్ దృశ్యాలను పరిశీలిస్తున్న సీపీ

- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి
- డ్రోన్ పెట్రోలింగ్ యూనిట్ ప్రారంభం

వేమనపల్లి/కోటపల్లి: తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాణహిత తీరం వెంట డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు రామగుండం సీపీ రెమా రాజేశ్వరి తెలిపారు. ఆదివారం మంచిర్యాల డీసీపీ రాంనాథ్‌కేకన్, మనోజ్‌కుమార్ ఐపీఎస్‌లతో కలిసి మంచిర్యాల జిల్లా వేమనపల్లి ఫెర్రీ పాయింట్, కోటపల్లి మండలం అర్జునగుట్ట, వెంచపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డ్రోన్ పెట్రోలింగ్ యూనిట్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ రెమా రాజేశ్వరి మాట్లాడుతూ మావోయిస్టుల కదలికలు, సంఘ విద్రోహ కార్యకలాపాలపై ముందస్తు సమాచారం తెలుసుకోవడం కోసం తీరం వెంట సాంకేతిక పరిజ్ఞానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇప్పించి ఎన్నికలు పూర్తయ్యే వరకు డ్రోన్ కెమెరాలతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో సరిహద్దు ప్రాంతాల ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసులు కృషి చేస్తారని అన్నారు. మంచిర్యాల జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి తీర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల నిబంధనల మేరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కేంద్ర బలగాలు, సీఆర్పీఎఫ్, సీఐఎస్‌ఎఫ్, జార్ఖండ్, ఆర్మ్‌డ్ బెటాలియన్ సిబ్బంది విధుల్లో నిమగ్నమైనట్లు తెలిపారు. అనంతరం ఆయా మండలాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఏసీపీ మోహన్, చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మంగీలాల్, ఎస్సైలు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

బెల్లంపల్లి: పట్టణంలోని కాంటాచౌరస్తా వద్ద ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. కాంటాచౌరస్తా వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన గజెల్లి వినోద్ మద్యం బాటిళ్లు తీసుకెళ్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద రాయల్ స్టాగ్ 180 ఎంఎల్ బాటిళ్లు 96, ఆఫీసర్స్ చాయిస్ 90 ఎంఎల్ బాటిళ్లు 50 లభించాయని, వాటి విలువ రూ.26 వేలవరకు ఉంటుందని ఎస్‌హెచ్‌వో తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రూ.1.36 లక్షల విలువైన మద్యం పట్టివేత

మందమర్రిరూరల్: పట్టణంలోని పాలచెట్టు ఏరియా నుంచి రామకృష్ణాపూర్‌కు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. దొరల బంగ్లాస్ ఏరియాలో అదనపు ఎస్సై హరిశేఖర్, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా కారును ఆపి తనిఖీ చేయగా మద్యం కాటన్స్ లభించాయి. పట్టుకున్న మద్యం విలువ రూ.1,36,620 ఉంటుందని ఎస్సై తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేసి నిందితుడు సందీప్‌కుమార్ సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ట్రిపుల్‌ఐటీలో విద్యార్థి ఆత్మహత్య

- భైంసా పోస్టుమార్టం గదిలో విద్యార్థి మృతదేహం
- ఆస్పత్రి వద్ద పోలీసు బందోబస్తు
- విద్యార్థి మృతిపై అనుమానాలు



ప్రవీణ్‌కుమార్ మృతదేహం

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న రామాటి ప్రవీణ్‌కుమార్ (19) వసతిగృహంలోని గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగర్‌కర్నూలు జిల్లాకు చెందిన విద్యార్థి వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ట్రిపుల్‌ఐటీ అధికారులు చెబుతున్నారు. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రిలోని పోస్టుమార్టం గదిలో భద్రపరిచారు.

ఔట్‌పాస్ తీసుకుని...

ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రవీణ్‌కుమార్ శనివారం ఔట్‌పాస్ తీసుకున్నాడు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు విద్యార్థులు ఇళ్లకు వెళ్తున్నారు. శనివారం ఔట్‌పాస్ తీసుకున్న విద్యార్థి ఆత్మహత్య ఎప్పుడు చేసుకున్నాడో అంతుచిక్కడం లేదు. అధికారులైతే ఆదివారం ఉదయం అల్పాహారం చేశాడని చెబుతున్నారు. ఒక రోజు ఔట్‌పాస్ తీసుకున్న విద్యార్థి అక్కడే ఎందుకు ఉండిపోయాడనే విషయం అంతుపట్టని ప్రశ్న. ఔట్‌పాస్ తీసుకున్న విద్యార్థులు కళాశాలలో ఉన్నారో బయటికి వెళ్లిపోయారా అనే విషయాన్ని భద్రతా సిబ్బంది చూసుకుంటున్నారో లేదో అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

ఖాళీ గదిలో ఆత్మహత్య...

ప్రవీణ్‌కుమార్ బీహెచ్–1 వసతి గృహంలో ఉంటున్నాడు. ఆదివారం బీహెచ్–2 వసతి గృహంలోని ఖాళీ గదిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వసతి గృహంలోని ఖాళీ గదుల్లోనే గతంలో విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. వసతి గృహాల్లో ఖాళీ గదులకు తాళాలు ఎందుకు వేయడం లేదనే అనుమానం తలెత్తుతోంది. ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థి మెడ భాగం కమిలిపోయి ఉందని, ఆత్మహత్య ఎప్పుడు చేసుకున్నాడో తెలియడం లేదని పలువురు చెబుతున్నారు.

పోలీసు భద్రత...

విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న వెంటనే మృతదేహాన్ని అంబులెన్సులో భైంసాకు తరలించారు. పోస్టుమార్టం గది వద్దకు ఎవరిని అనుమతించలేదు. మృతదేహాన్ని లోపల భద్రపరిచి తాళం వేశారు. ఆసుపత్రి వద్ద పోలీసు బందోబస్తు మోహరించారు. ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలు ఎందుకు జరుగుతున్నాయనే విషయం అంతు చిక్కడం లేదు.

కమనీయం.. కార్తీకం

- నేడు కార్తీక పౌర్ణమి
- ఈ మాసంలో వచ్చే ప్రధాన పండుగ
- నెలరోజుల పాటు మహిళల ప్రత్యేక పూజలు



కెరమెరిలో మంగళహారతులతో మహిళలు



దండేపల్లి: సామూహిక వ్రతాల్లో భక్తులు

మంచిర్యాలఅర్బన్/కెరమెరి: కార్తీక మాసం ప్రారంభం నుంచి ఆలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. సోమవారం కార్తీకపౌర్ణమి నేపథ్యంలో పలు ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమి రోజున స్నానం , దానం, కొన్ని చర్యలతో సర్వపాపాలు తొలగిపోయి మోక్ష ప్రాప్తి కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ పవిత్రమైన రోజున ఉపవాసం ఉంటారు. సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తారు. 9 దీపాలనుంచి 365 దీపాలు(వొత్తులు) వెలగించడం వరకు జరుపుతుంటారు. ఈ మాసంలో చేసిన పూజలు, దాన ధర్మాలు, దీపారాధనలు, పురాణ శ్రవణంతో జన్మజన్మల పాపాలను హరింప జేస్తాయని ప్రతీతి. కార్తీకపౌర్ణమిని కైశిక, లేదా వైకుంట పౌర్ణమి అని తెలంగాణ పరిభాషలో 'జిడికంట పున్నమి' అని కూడా పిలుస్తారు. నెల రోజుల పాటు మహిళలు తులసీదళానికి పూజలు, రావిచెట్టుకు ప్రదక్షిణలు చేస్తారు.

గొప్ప వ్రతాల్లో ఒకటి..

కార్తీక పౌర్ణమి వ్రతం గొప్ప వ్రతాల్లో ఒకటిగా ప్రసిద్ధిగాంచింది. తెలుగు ప్రజలు కార్తీకపౌర్ణమి రోజున చలిమిడి చేస్తారు. ఈ రోజు వేపుడు బియ్యం లేదా అటుకులు నైవేద్యంగా పెడతారు. బలి చక్రవర్తికి ఓసారి శరీరమంతా మంటలు వ్యాపించగా సంస్థాన వైద్యులు, ప్రత్యేక పురోహితుల సలహా మేరకు కార్తీక మాసం నాడు శివున్ని పూజించగా మంటలు పూర్తిగా తగ్గి పోయాయని ప్రతీతి. ఆ రోజు నుంచి కార్తీక పౌర్ణమి వ్రతం ఆచరణలో ఉందని పెద్దలు చెబుతారు.

తులసీ కల్యాణం

కార్తీకపౌర్ణమి సందర్భంగా తులసీ కల్యాణం చేయడం శుభప్రదమని చెబుతారు. తులసీ కల్యాణం వల్ల వాతావరణం పవిత్రంగా ఉంటుంది. పాపి ఆలోచలనను తొలగిస్తుంది. ఇందుకోసం ప్రతీ ఇంట్లో తులసీ పాపపుణ్యాల స్థానం కలిగి ఉండాలి. తులసి అంటే నారాయణుడికి అత్యంత ప్రియం. తులసీ కల్యాణం జరిపిస్తే ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో వర్ధిల్లుతారు. ఉసిరిచెట్టుతో వివాహం జరపడం సంప్రదాయంగా వస్తోంది. తులసీమాత మండపం చెరుకు ఆకులతో తయారు చేస్తారు. ఇలా చేస్తే చెరుకులోని తీయదనం మన జీవితంలో కూడా లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.

మార్కెట్ కళకళ

కార్తీక మాసంలో పూలమార్కెట్ కళకళలాడుతోంది. బంతి, చామంతి పూలు, పూజా సామగ్రికి డిమాండ్ ఉంది. బంతిపూలు కిలోకు రూ.50 నుంచి 80 వరకు విక్రయిస్తున్నారు.

గూడెంలో 'కార్తీక' సందడి

దండేపల్లి: రెండో అన్నవరంగా పిలువబడే మండలంలోని గూడెం గుట్టపై వెలిసిన శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో కార్తీక సందడి కొనసాగుతోంది. కార్తీక మాసం ప్రారంభం నుంచి ఆలయం వద్ద నిత్యం భక్తుల రద్దీ నెలకొంటోంది. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. సత్యదేవున్ని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. గుట్టపై, కింద కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులు అధికసంఖ్యలో రాగా ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసి పోయాయి. ఆలయ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశారు.

క్యూలైన్లో భక్తుల ఇబ్బందులు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. సత్యదేవుడి దర్శనానికి వెళ్లే సమయంలో సత్యనారాయణ వ్రతాలు నోముకున్న భక్తులు, సాధారణ భక్తులు ఒకే క్యూలైన్లో రావడంతో ఇబ్బందులు తలెత్తడంతో సిబ్బందిపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

తొలి ఓటరుకు సన్మానం



సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోనేరు

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని మాలిని గ్రామానికి చెందిన తెలంగాణ తొలి ఓటరు ఆత్రం రాంబాయిని ఆదివారం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో మొదటి నియోజకవర్గం, నెంబర్‌వన్ పోలింగ్ కేంద్రం, నెంబర్ వన్ ఓటరు మన ప్రాంతానికి చెందిన ఆదివాసీ మహిళ కావడం గర్వనీయమన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఒకరిపై కేసు

జన్నారం: మండలంలోని తిమ్మాపూర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎఫ్‌ఎస్‌టీ అధికారి విధులకు ఆటంకం కల్పించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆదివారం తిమ్మాపూర్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది (ఎఫ్‌ఎస్‌టీ) వాహనాలు తనిఖీ చేస్తుండగా బీఆర్‌ఎస్ సభకు బయలుదేరుతున్న బస్సును కూడా ఆపి తనిఖీ చేస్తున్న క్రమంలో తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చంద్రయ్య సిబ్బందిని దుర్భాషలాడుతూ విధులకు ఆటంకం కల్పించాడు. సిబ్బంది శీలం సతీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్



ఓట్ల లెక్కింపు గదిని పరిశీలిస్తున్న కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు నిర్వహణలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సూక్ష్మ పరిశీలకులు, సహాయకులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బెల్లంపల్లి రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్లు రాహుల్, మోతిలాల్, మంచిర్యాల రిటర్నింగ్ అధికారి రాములు, చెన్నూర్ రిటర్నింగ్ అధికారి సిడాం దత్తు, జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు రమేశ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతితో కలిసి కౌటింగ్ సూపర్‌వైజర్లు, సూక్ష్మ పరిశీలకులు సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లపై సమీక్ష

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలో ఏర్పాట్లపై కలెక్టర్ సంతోష్ సమీక్షించారు. స్ట్రాంగ్ రూం, లెక్కింపు గదులను పరిశీలించారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్ నేపథ్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి బి.సంతోష్ ప్రకటనలో తెలిపారు. ప్రచార, ప్రసార సాధనాలలో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అంశాలన్నింటిని నిషేధించినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే చిన్నయ్యకు నిరసన సెగ



పోలీసు వాహనాలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

భీమిని: కన్నెపల్లి మండలం సుర్జాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని జంగంపల్లిలో ఎన్నికల ప్రచారానికి వస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య వాహనాలను శనివారం రాత్రి గ్రామస్తులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే ప్రచారానికి వస్తున్నాడని తెలుసుకున్న గ్రామస్తులు కూడళ్ల వద్ద అడ్డుకునేందుకు రెడీగా ఉండడంతో విషయం తెలుసుకున్న పోలీసులు గొడవలు జరగకూడదనే ఉద్దేశంతో జంగంపల్లి వైపుకు వెళ్లగా వారి వాహనాలను సైతం అడ్డుకుని ఎమ్మెల్యే గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు నిరసనకారులతో మాట్లాడి అక్కడి నుంచి పంపించారు. కానీ ఆ సమయంలో ఎమ్మెల్యే చిన్నయ్య సుర్జాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జంగంపల్లిలో ప్రచారం చేయకుండానే వెనుదిరిగి వెళ్లిపోయారు.